క్లుప్తంగా

వాహనాల తనిఖీ



దెందులూరు హైవే వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న అధికారులు

దెందులూరు: ఎన్నికల విధుల నిర్వహణలో భాగంగా మంగళవారం దెందులూరు జాతీయ రహదారిపై ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వివిధ వాహనాల నంబర్లను నోట్ చేసుకుని కార్లల్లో సోదాలు నిర్వహించారు. దెందులూరు చెక్ పోస్టు, సోమవరప్పాడు, గుండుగొలను హైవే వద్ద తనిఖీలు దెందులూరు తహసీల్దార్ వీ.జి తేంద్ర తనిఖీ చేశారు.

పల్లాలమ్మ ఆలయంలో వాసుబాబు పూజలు



చానమిల్లిలో పల్లాలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

నిడమర్రు: చానమిల్లి గ్రామ దేవత పల్లాలమ్మ వార్షిక జాతర మహోత్సవాల్లో మంగళవారం ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా భక్తులతో కొద్దిసేపు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ బేతు నాని, మాజీ కన్వీనర్ బేతు రాజశేఖర్, సర్పంచ్ నంద్యాల ప్రసాదు, ఉపసర్పంచ్ వెజ్జు సరేష్, పడాల శ్రీశైలం, దాసరి రామకృష్ణ, పార్టీ అధ్యక్షుడు గరికిపాటి సాయిరాం, కురుపూడి గంగరాజు తదితరులున్నారు.

వార్షిక పరీక్షలకు ఏర్పాట్లు



కాశిపాడు పాఠశాలలో విద్యార్థుల రాత పుస్తకాలు తనిఖీ చేస్తున్న ఎంఈవో శేషు

గణపవరం: త్వరలో ప్రారంభం కానున్న వార్షిక పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశామని గణపవరం ఎంఈవో పుచ్చల శేషు అన్నారు. మంగళవారం గణపవరం మండలం కాశిపాడులో ప్రాథమిక పాఠశాలలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. సిలబస్ పూర్తయిందా లేదా అన్నది ఆరా తీశారు. విద్యార్థుల నోటు పుస్తకాలు, వర్క్‌బుక్‌లు తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. పరీక్షల సన్నద్ధతపై విద్యార్థులను పరీక్షించారు. పరీక్షలను ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

దెందులూరు కాంగ్రెస్ ఇన్‌చార్జి చౌదరి రాజీనామా



మాట్లాడుతున్న చౌదరి

దెందులూరు: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల ధోరణిని వ్యతిరేకిస్తూ ఆమె దిష్టిబొమ్మను ఆపార్టీ దెందులూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, రాష్ట్ర అధికార ప్రతినిధి డీవీఆర్‌కే చౌదరి ఏలూరులో నాయకులతో కలిసి దహనం చేశా రు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని తరుచూ విమర్శించడంతో షర్మిల పద్ధతులు నచ్చక రాజీనామా చేస్తు న్నట్టు తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి చలసాని ఉదయ్‌కిరణ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కంచెర్ల గంగాధరరావు, పెదపాడు మండల అధ్యక్షుడు మిడతా వెంకట్, పెదవేగి మండల ప్రధాన కార్యదర్శి నందిపాము కృపావర్మ, ఏలూరు రూరల్ మండల అధ్యక్షుడు నిమ్మలూరి రాజీవ్‌కుమార్, తదితరులు తమ రాజీనామా పత్రాలను జాతీయ అధ్యక్షుడు ఖర్గేకు, షర్మిలకు పంపారు.

‘పోషణ’తో పండంటి బిడ్డ



అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం తీసుకుంటున్న గర్భిణులు, బాలింతలు



లబ్ధిదారులకు అంగన్‌వాడీ ద్వారా పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త (ఫైల్)

- రక్తహీనతకు గుడ్ బై
- ఫలిస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ
- గర్భిణుల్లో తగ్గుతున్న పౌష్టికాహార లోపం
- నియోజకవర్గ పరిధిలో 19,370 మందికి లబ్ధి



చిన్నారిని ఎత్తుకున్న సీఎం జగన్ చిత్రం

పెదవేగి : గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం సత్ఫలితాలిస్తోంది. ఈ పథకం వల్ల ప్రభుత్వం ఆశించిన లక్ష్యాలు ఇప్పుడు స్పష్టంగా కన్పిస్తున్నాయి. పేదరికం వల్ల గర్భిణులు సరైన పోషకాహారం తీసుకోకపోవడం వల్ల వారికి పుట్టిన బిడ్డలు పౌష్టికాహార లోపంతో బాధపడుతూ అనేక వ్యాధుల బారినపడేవారు. పిల్లలు సరైన ఎదుగుదలకు నోచుకోవడంలేదని గుర్తించిన ప్రభుత్వం నివారణ చర్యలు చేపట్టింది. మూడేళ్ల క్రితం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. గర్భిణులకు గతంలో ఇచ్చే పప్పు, పాలు, గుడ్డుకు అదనంగా మరో ఆరు రకాల పోషకాహారం అందించడంతో వారిలో రక్తహీనత తగ్గింది. తద్వారా ఆరోగ్యవంతమైన శిశువులకు జన్మనిస్తున్నారు.

దెందులూరు నియోజకవర్గ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో..

పెదపాడు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో పెదపాడు, పెదవేగి, దెందులూరు ఏలూరు రూరల్ మండలాల్లో 279 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఈ కేంద్రాల్లో గర్భిణులు 2,073 మంది బాలింతలు 1,931 మంది, ఏడు నెలల నుంచి మూడేళ్ల లోపు పిల్లలు 8,559 మంది, మూడు నుంచి ఆరేళ్ల లోపు పిల్లలు 6,807 మంది ఉన్నారు. వీరందరూ వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో ఇప్పుడు లబ్ధి పొందుతున్నారు.

ఏడు నెలల నుంచి మూడేళ్ల వరకు ..

రెండున్నర కిలోల బాలామృతం, రెండున్నర లీటర్ల కూర, కోడిగుడ్లు, 100 ఎం.ఎల్ పాలు పాలు, 25 కోడిగుడ్లు, మూడు నుంచి ఆరేళ్ల చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో వంట చేసి పెడుతున్నారు.

మెనూ వివరాలు

సోమ, గురువారాలు అన్నం, కూరగాయలతో సాంబారు, కోడిగుడ్డు కూర, 100 ఎం.ఎల్ పాలు, మంగళ, శుక్రవారాలు అన్నం, పప్పు, తోటకూర కూర, కోడి, గుడ్డు, 100 ఎం.ఎల్ పాలు, బుధ, శనివారా లు అన్నం లేదా వెజిటబుల్ రైస్ లేదా, పులిహోర, గోంగూర కూర, కోడిగుడ్డు, 100 ఎం, ఎల్ పాలు.

సంపూర్ణ పోషణ కిట్ల సరఫరా

గర్భిణులు, బాలింతలకు కిలో రాగి పిండి, కిలో అటుకులు, 250 గ్రాముల వేరుశనగ చిక్కీ, కిలో జొన్నపిండి, 250 గ్రాముల బెల్లం , 250 గ్రాముల ఎండు ఖర్జూరం, మూడు కిలోల బియ్యం, అరకిలో నూనె, అరకిలో పప్పు, ఐదు లీటర్ల పాలు, 25 కోడిగుడ్లు ఇస్తున్నారు. వీటన్నింటినీ డ్రై రేషన్‌గా లబ్ధిదారుల ఇళ్లకు ఇస్తున్నారు.

తల్లీబిడ్డ సంక్షేమానికి కృషి



సంపూర్ణ పోషణ పథకం గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఎంతగానో ఉపయోగపడుతోంది. అన్నిరకాల పోషకాలతో కూడిన ఆహారాన్ని ప్రభుత్వం అందిస్తోంది. ప్రతి తల్లీబిడ్డ సంక్షేమానికై గతంలో ఎన్నడూ లేని విధంగా సీఎం జగన్ ప్రత్యేక ప్రణాళికతో మాతా శిశు సంరక్షణకు అధిక మొత్తంలో బడ్జెట్ కేటాయించారు. మహిళ ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం, సమాజం ఆరోగ్యంగా ఉంటుంది.

– కొఠారు అబ్బయ్యచౌదరి, ఎమ్మెల్యే, దెందులూరు నియోజకవర్గం

250 మంది గర్భిణుల ఆరోగ్యంపై సర్వే



ప్రయోగాత్మకంగా 250 మంది గర్భిణులపై సర్వే నిర్వహించాం. మూడో నెల నుంచి ప్రసవించే వరకూ ప్రభుత్వం అందించే వైఎస్సార్ పోషణ కిట్‌తో పాటు, ఐరన్ మాత్రలు తీసుకున్న వారిలో 9 శాతం ఉన్న హిమోగ్లోబిన్ 11 శాతానికి పెరిగింది. 80 శాతం మందికి సహజ ప్రసవమైంది. పుట్టిన బిడ్డలు గతంలో 2 కిలోలు ఉంటే ఇప్పుడు రెండున్నర కిలోల వరకు ఉంటున్నారు. ఇద్దరిలో మాత్రమే బరువు తక్కువ పిల్లలు పుట్టినట్టు గుర్తించాం. మాతా మరణాలను అరికట్టగలిగాం.

– ఎం.సునీల్‌రాజశేఖర్, అదనపు సీడీపీఓ, పెదపాడు ప్రాజెక్ట్

పౌష్టికాహారంతో ఆరోగ్యం



మూడో నెల నుంచే మాకు సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రం పోషణ పథకంలో పౌష్టికాహారం తీసుకున్నాను. అది నాకు ఆరోగ్యపరంగా మంచిఫలితాన్ని ఇచ్చింది. ప్రభుత్వం నాణ్యమైన ఆహారాన్ని పంపిణీ చేస్తోంది. ప్రతినెలా అంగన్‌వాడీలో పంపిణీ చేసే వివిధ రకాల పౌష్టికాహార వస్తువులను క్రమంతప్పకుండా తీసుకున్నాను. ప్రస్తుతం నేను, నాబిడ్డ ఆరోగ్యవంతంగా క్షేమంగాఉన్నాం.

– పెదపూడి వెంకటరమణ, బాలింతరాలు, ముత్తనవీడు

సాయుధ దళాల కవాతు



ఉంగుటూరు మండలంలో కవాతు నిర్వహిస్తున్న సాయుధ దళాలు

ఉంగుటూరు: మండంలోని సమస్యాత్మక ప్రాంతాల్లో సాయుధ దళాలు మంగళవారం కవాతు నిర్వహించాయి. చేబ్రోలు పోలీసుల ఆధ్వర్యంలో సమస్యాత్మక పోలింగ్ గ్రామాలైన కాకర్లమూడి, బొమ్మిడి, ఉప్పాకపాడు, నీలాద్రిపురం గ్రామాల్లో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పోలీసులు భరోసా కల్పించారు.

పంట పొలాల పరిశీలన



పంట పొలాలను పరిశీలిస్తున్న జేడీ షేక్ హబీబ్ బాషా

దెందులూరు: కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు కొవ్వలి జిల్లేడుదిబ్బ ప్రాంతంలో సాగునీటి అసౌకర్యంగా ఉన్న పంటల పొలాలను మంగళవారం వ్యవసాయ శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ షేక్ హబీబ్ బాషా అధికారులతో కలిసి పరిశీలించారు. సమీప రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇరిగేషన్ జిల్లా అధికారులతో మాట్లాడి 48 గంటల్లో సమస్యల పరిష్కారానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటామన్నారు. కొవ్వలి ప్రాంతంలో పరిస్థితులను కలెక్టర్‌కు వివరిస్తామని అన్నారు. జాయింట్ డైరెక్టర్ వెంట జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ సుబ్బారావు, దెందులూరు మండల వ్యవసాయ అధికారి గద్దె రమేష్, రైతులు ఉన్నారు.

వలంటీర్ల వ్యవస్థపై అక్కసు దారుణం

- టీడీపీ మూల్యం చెల్లించక తప్పదు
- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి



ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

దెందులూరు: వలంటీర్ వ్యవస్థపై అక్కసుతో పింఛన్ల పంపిణీని అడ్డుకోవడం దారుణమని, అవ్వా, తాతల ఉసురుపోసుకుంటున్న టీడీపీ అధినేత చంద్రబాబు తగిన మూల్యం చెల్లించక తప్పదని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ ఆధ్వర్యంలో సాగిన ఈ రాక్షస కుట్రకు వృద్ధులు, అంధులు, వికలాంగులు, వితంతు మహిళలు బలవుతున్నారన్నారు. వాస్తవాలు ఇలా ఉంటే టీడీపీ అసత్య ప్రచారం చేయడం రాష్ట్ర ప్రజలందరూ గమనిస్తున్నారని ఎమ్మెల్యే ఖండించారు. వలంటీర్లపై ఈసీకి ఫిర్యాదు చేసి ఏప్రిల్ 1న పింఛన్ పంపిణీలో జాప్యం కలిగించేలా చేసిన టీడీపీపై ఎమ్మెల్యే కొఠారు తీవ్రంగా మండిపడ్డారు. తన వాళ్ల సంస్థ సిటిజన్ ఫర్ డెమోక్రసీ ద్వారా చంద్రబాబు ఆడిన రాక్షస క్రీడలో లక్షలాది మంది ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రజల జీవితాలతో పెనవేసుకున్న వలంటీర్ల వ్యవస్థను తీసుకువచ్చిన జగనన్నపై కక్ష సాధింపుగా టీడీపీ ఈ ప్రజా వ్యతిరేక చర్యకు పూనుకుందన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే ఇంకా ఏం దాష్టీకాలు చేస్తారో, తమకు ఇంకెన్ని కష్టాలు తెచ్చిపెడతారోనని ప్రజలు అనుకుంటున్నారని తెలిపారు. ఎన్నికల ముందు చంద్రబాబు నిజస్వరూపాన్ని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. పెన్షన్ల విషయంలో టీడీపీ చేస్తున్న నీచమైన అసత్య ప్రచారాన్ని ఎమ్మెల్యే తీవ్రంగా ఖండించారు.

ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి విశేష స్పందన



భీమడోలులో వృద్ధురాలిని పరీక్షిస్తున్న వైద్యులు కె.శ్రీలక్ష్మీ, జాహ్నవి



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య నిపుణుడు

భీమడోలు: ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమంలో భాగంగా భీమడోలు సచివాలయం-1 వద్ద మంగళవారం నిర్వహించిన వైద్య శిబిరానికి రోగులు పోటెత్తారు. పంచాయతీ పరిధిలోని ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ శిబిరంలో భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరిండెంటెంట్ డాక్టర్ ఎం.సునీతతో పాటు పలు విభాగాలకు చెందిన వైద్య బృందం రోగులను పరీక్షించారు. ఆరోగ్య సూత్రాలు, తీసుకోవాల్సిన ఆహార నియమాలను వివరించారు. ఈ సందర్భంగా భీమడోలు సీహెచ్‌సీ పర్యవేక్షకురాలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలన్నదే లక్ష్యమన్నారు. ప్రతి ఒక్కరూ ఈ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం శిబిరానికి వచ్చిన బాలింతలు, గర్భిణులు, కౌమర, నవజాతల సంరక్షణ తదితర అంశాలకు సంబంధించి రోగులకు సునీత పరీక్షించి వారికి ఉచితంగా మందులను అందించారు. జనరల్ విభాగపు వైద్యులు కె.శ్రీలక్ష్మీ, ఆర్.జాహ్నవి, ఎముకలకు సంబంధించిన వైద్యులు సీహెచ్ సుధాకర్ పరీక్షలు చేసి ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. ఓ వెంకటరెడ్డి కంటి పరీక్షలు చేశారు. శిబిరంలో 415 మంది హాజరు కాగా వారికి వివిధ పరీక్షలు చేశారు. కంటి వైద్య నిపుణులు 6 మందికి కంటి పరీక్షలు చేసారు. రక్తపరీక్షలు చేసి ఉచితంగా మందులను అందించారు. ఆపరేషన్ల కోసం నలుగురిని రిఫర్ చేశారు. గ్రామ సచివాలయ సిబ్బంది, సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ కాలనీలో ‘గడపగడపకు మన వాసన్న’

గణపవరం: గణపవరం మండలం చినరామచంద్రపురం శివారు వైఎస్సార్ ఇందిరమ్మ కాలనీలో ఈనెల 3వ తేదీ బుధవారం గడపగడపకు మన వాసన్న కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ రొంగల శ్రీను తెలిపారు. కాలనీలో ఇంటింటికీ వెళ్లి వాసుబాబు ఎన్నికల ప్రచారం చేస్తారని, ప్రభుత్వ పథకాలను వివరించి ఓట్లు అభ్యర్థిస్తారని తెలిపారు. పార్టీ శ్రేణులంతా ఈ కార్యక్రమానికి హాజరుకావాలని ఆయన కోరారు.

పింఛన్ల పంపిణీని అడ్డుకునేందుకు చంద్రబాబు కుట్ర



చినసత్యవోలులో ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

పెదపాడు: వృద్ధులకు వికలాంగులకు పింఛన్లు ఇవ్వకుండా అడ్డుకునేందుకు చంద్రబాబు ఆరాటపడుతూ కుట్రలకు పాల్పడుతున్నారని ఎన్నికల కమిషన్‌కు తన అనుచరులతో ఫిర్యాదు చేశారని జెడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. ఎన్ని ఎత్తుగడలు వేసినా పింఛన్ల పంపిణీని ఆపడం ఎవరికీ సాధ్యం కాదని జెడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ తెలిపారు. పెదపాడు మండలంలోని చిన సత్యవోలులో నేను సిద్ధం మా ఊరు సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబుకు ఏనాడైనా వృద్ధులు, వికలాంగుల ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అందించాలన్న ఆలోచన వచ్చిందా అని ప్రశ్నించారు. చంద్రబాబు హయాంలో పింఛన్లు ఇవ్వాలంటే అప్పటి వరకూ లబ్ధిపొందుతున్న వ్యక్తి మరణిస్తే వారి స్థానంలో మరొకరికి ఇచ్చేవారని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారని గుర్తు చేసారు. పేదల పక్షాన నిలిచేది జగన్‌మోహన్‌రెడ్డి అని, పెత్తందార్లు, స్వార్ధ పరుల పక్షాన నిలబడేది చంద్రబాబు అని స్పష్టం చేసారు. రాబోయే ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని బలపర్చాల్సిన అవసరముందని చెప్పారు. ఫ్యాను గుర్తుపై ఓటు వేసి పార్టీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, వడ్డి కార్పొరేషన్ డైరెక్టరు ఘంటసాల ప్రభాకరరావు, చేపేని రంగారావు, రంభ ఉమామహేశ్వరి, సొంగల మహేశ్వరరావు, పెంకి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రామారావుగూడెంలో ‘మేమంతా సిద్ధం’



రామారావుగూడెంలో ప్రచారం నిర్వహిస్తున్న కామిరెడ్డి నాని, సర్పంచ్ పర్వతనేని శ్రావణి, సుధీర్, నాయికులు

దెందులూరు : రాబోయే ఎన్నికల్లో రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుకు ఎమ్మెల్యేగా కొఠారు అబ్బయ్యచౌదరికి, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్‌కు వేయాలని వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని అన్నారు. మంగళవారం రామారావుగూడెంలో సర్పంచ్ పర్వతనేని శ్రావణి సుధీర్, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పర్వతనేని వెంకట్రాజు, ఎంపీటీసీ కాలి ఇస్రాయేలు, నాయకుల ఆధ్వర్యంలో మేముంతా సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లికి వైఎస్సార్ సీపీ అమలు చేసిన సంక్షేమం పథకాలను వివరించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కస్సే శ్రీనివాసరావు, పార్టీ నాయకులు పేరం ప్రసాద్, పర్వతనేని నరేంద్ర, పుల్లా శివప్రసాద్, కొత్తపల్లి సుబ్బారావు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

బడుగు, బలహీన వర్గాలకు ప్రాధాన్యం



కొత్తముప్పర్రు శివారు అందేఖాన్ చెరువులో ప్రచారం చేస్తున్న అక్కినేని రాజశేఖర్

పెదపాడు: బడుగు, బలహీన వర్గాలకు పెద్దపీట వేసింది ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్ తెలిపారు. పెదపాడు మండలంలోని కొత్తూరు గ్రామ శివారు అందేఖాన్ చెరువు, వీరభద్రపురం గ్రామాల్లో మంగళవారం నేను సిద్ధం మా ఊరు సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పేదలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన కొనసాగేందుకు ప్రజలంతా ఫ్యాను గుర్తుపై ఓటు వేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కోట గోవర్ధన్, ఎంపీటీసీ కర్రె అనీల్‌కుమార్, వార్డు మెంబరు కొమ్మిన రాజారత్నం పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి



మాట్లాడుతున్న ఆర్వో ఖాజావలి

ఉంగుటూరు: ఉద్యోగస్తులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తూ.చ తప్పకుండా అమలు చేయాలని ఉంగుటూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఖాజావలి అన్నారు. మంగళవారం ఉంగుటూరులో వాసవీ కల్యాణ మండపంలో బీఎల్వోలు, వివిధ రకాల టీమ్‌లు, వీఆర్వోలు, ఎంపీడీవోలతో సమావేశం నియోజకవర్గ స్థాయిలో నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్వో ఖాజావల్లి మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ దృష్టి సారించి పని చేయాలని సూచించారు. నామినేషన్ల ప్రక్రియ నుంచి, ఈవీఎం యంత్రాలు స్ట్రాంగ్ రూమ్‌కు వెళ్లేంత వరకు విధి నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరించాలని లేకుంటే ఇబ్బందులకు గురవుతారని హెచ్చరించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. త్రీ టైర్ బందోబస్తు ఉంటుందని స్పష్టం చేశారు. డిస్ట్రిబ్యూషన్ మొదలుకుని పోలింగ్‌స్టేషన్‌కు వెళ్లేంత వరకు అప్రమత్తంగా పని చేయాలన్నారు. 144 సెక్షన్ అమలులో ఉందని స్పష్టం చేశారు. ఏదైనా సమస్య వస్తే కేంద్రీయ కార్యాలయానికి రిపోర్ట్ చేయాలన్నారు. గణపవరం సీఐ రవికుమార్ మాట్లాడుతూ సమస్యాత్మక గ్రామాల్లో ఇప్పటికే పోలీసు భద్రతా దళాలు కవాతులు నిర్వహిస్తున్నాయన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల సహాయ అధికారులు వెంకట శివయ్య, జి.వరహాలయ్య, కె.పోసిబాబు, వై.రాంబాబు, నిడమర్రు సీఐ ఎంవీ సుభాష్, ఎంపీడీవోలో స్వర్ణలత, శివ, నారాయణ, శివరామకృష్ణ, సెక్టార్ అధికారులు, బూత్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

దివ్యాంగులకు పోషకాహారం పంపిణీ

భీమడోలు: గుండుగొలనులోని విఘ్నేశ్వర దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం 55 మంది దివ్యాంగులకు దాతలు సాయమందించారు. గ్రామానికి చెందిన దాట్ల సూర్యనారాయణరాజు జ్ఞాపకార్థం ఆయన అల్లుడు ఇందుకూరి సత్యనారాయణరాజు ఆర్థిక సాయంతో బియ్యం, పండ్లు, పోషకాహారం అందించారు. నిర్వాహకులు పేరిచర్ల శ్యామలరాజు, గేదెల శ్రీనివాసరావు, అరసంకల సోములు, రావి గంగరాజు, ఫిజియోథెరపిస్ట్ జి.రాంబాబు, కంబయ్య, మామిడిపల్లి నాగభూషణం పాల్గొన్నారు.

ఉమ్మడి అభ్యర్థి తీరుపై జనసేన నేతల ఆగ్రహం

దెందులూరు: జనసేన పార్టీకి సంబంధించి దెందులూరు నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఎవరినీ పార్టీ నియమించలేదని, ఉమ్మడి పార్టీల అభ్యర్థి నియంతృత్వ ధోరణి కొనసాగితే రాబోయే రోజుల్లో కష్టాలు తప్పవని జనసేన పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి, నియోజకవర్గ ముఖ్యనేత కలపాల ప్రేమ్‌కుమార్ అన్నారు. మంగళవారం దెందులూరులో ఆయనతోపాటు జనసేన పార్టీ నుంచి ఆర్.జోసెఫ్ తంబి, మట్టా రంగబాబు, తిరుపతి వాసు, గొల్ల నాగేంద్ర, మేడిద రిత్వి సమావేశం నిర్వహించారు. దెందులూరు నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి పొత్తు ధర్మాన్ని పాటించడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘంటశాల వెంకటలక్ష్మి పార్టీ రాష్ట్ర కార్యదర్శి మాత్రమేనని, ఆమె ఇన్‌చార్జి కాదని స్పష్టం చేశారు. జనసేన పార్టీలో ఆమెకు ఏ విధమైన పదవి లేకపోయినా పార్టీ నిబంధనలకు విరుద్ధంగా కమిటీలు వేయడంపై మండిపడ్డారు. వెంకటలక్ష్మితో కలిసి ఉమ్మడి పార్టీల అభ్యర్థి నియంతృత్వ ధోరణితో వెళ్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.